క్లుప్తంగా

ఆటల్లో పోటీ పడాలి

కర్నూలు (టౌన్) : విద్యార్థినీ విద్యార్థులు ఆటల్లో పోటీ పడాలని కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి అన్నారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో షూటింగ్ బాల్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు.కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర, పరుశరాముడు పాల్గొన్నారు.

సేవా పక్షోత్సవంలో మెడికల్ క్యాంప్

కర్నూలు కల్చరల్ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకల సందర్భంగా సేవా పక్షోత్సవాల్లో భాగంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వీఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో పాణ్యం నియోజక వర్గం బాలాజీ నగర్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వినూష రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గీతామాధురి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో ఆ హాస్పిటల్ అధినేత డాక్టర్ వాసురెడ్డి వైద్య సేవలు అందించి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు.

పీఎంజేజేబీవైను సద్వినియోగం చేసుకోండి



లక్ష్మీదేవి కుటుంబానికి చెక్ అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై) సదుపాయాన్ని ప్రతి ఒక్కరు పొందాల్సిన అవసరం ఉందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ అధికారి పి.నరసింహారావు తెలిపారు. శనివారం ఓర్వకల్ మండలం నన్నూరు బ్రాంచ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజనపై అవగాహన కల్పించారు. బ్యాంకులో ఖాతా కలిగిన ప్రతి ఒక్కరు నామ మాత్రపు మొత్తంతో ప్రమాద బీమా పొంద వచ్చని తెలిపారు. ఈ బీమా పథకాలు ఆపత్కాలంలో కుటుంబానికి ఎంతో తోడ్పడుతాయని పేర్కొన్నారు. బీమా పొందిన లక్ష్మీదేవి కుటుంబానికి రూ.2లక్షల బీమా పరిహారాన్ని చెక్ రూపంలో అందచేశారు. కార్యక్రమంలో నన్నూరు బ్రాంచీ మేనేజర్ బాలరంగన్న తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కార్మికులతో మాట్లాడుతున్న డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ

కర్నూలు(సెంట్రల్) : కలెక్టరేట్‌లోని వివిధ శాఖల కార్యాలయాల పరిసరాలను సంబంధిత అధికారులు పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ ఆదేశించారు. శనివారం ఆమె స్వచ్ఛాంధ్ర లో భాగంగా కలెక్టరేట్‌లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. అనంతరం తన కార్యాలయంలో మాట్లాడుతూ..కారిడార్లలో పేపర్లు, ఇతర వస్తువులు వేయరాదన్నారు. వేసిన వారికి జరిమానా విధిస్తామని చెప్పారు.

విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లు సత్వరం పరిష్కరించాలి



రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న జేఏసీ నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోకుండా ఉండిపోయిన సమస్యలు, ఇతర డిమాండ్‌లను సత్వరం పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం, విద్యుత్ సంస్థల యాజమాన్యాలు తగిన చర్యలు తీసుకోవాలని ఏపీ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ కర్నూలు జిల్లా నేతలు డిమాండ్ చేశారు. ఈ నెల 15 నుంచి చేపట్టిన ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా జేఏసీ రెండో రోజైన శనివారం కూడా స్థానిక విద్యుత్ భవన్‌లో రిలే నిరాహార దీక్షలు చేపట్టింది. ఇందులో వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు. జేఏసీ చైర్మన్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ... గతంలో ఉద్యమాల ద్వారా సాధించుకున్న అనేక హక్కులను, ప్రయోజనాలను ఉపసంహరిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తుండటం దారుణమని పేర్కొన్నారు. కో చైర్మన్ శంకర్ మాట్లాడుతూ... సుప్రీం కోర్టు తీర్పుల ప్రకారం రెగ్యులర్ ఉద్యోగులకు వర్తించే హక్కులు, ప్రయోజనాలు కాంట్రాక్ట్ కార్మికులకు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం దారుణమని పేర్కొన్నారు. జేఎల్‌ఎం గ్రేడ్-2 ఉద్యోగులను విద్యుత్ సంస్థల్లో విలీనం చేసి వారికి విద్యుత్ సంస్థల సర్వీస్ నిబంధనలను అమలు చేయాలని కోరారు. రిలే దీక్షల్లో జేఏసీ నేతలు నాగశేషులు, రమణమూర్తి, దంలా నాయక్, హుస్సేని, శివకుమార్, తిరుమలయ్య, బాస్కర్, శుభాకర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపు అందరి బాధ్యత

- పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీలో పెద్దాసుపత్రి సూపరింటెండెంట్





కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, స్వచ్ఛత్సవ్ ర్యాలీలో ఆర్‌యూ వీసీ వెంకటబసరావు తదితరులు

కర్నూలు(హాస్పిటల్):పచ్చదనం పెంపు అందరి బాధ్యత అని, ఇందులో భాగంగా ప్రతి వ్యక్తి తమ ఇంటి పరిసరాల్లో ఒక మొక్క నాటి సంరక్షించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆసుపత్రి ఆవరణలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యులు, సిబ్బంది కలిసి ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఇన్‌చార్జ్ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి పాల్గొన్నారు.

- కర్నూలు మెడికల్ కాలేజీ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. గ్రీన్ ఏపీ నినా దానికి అనుగుణంగా ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటాలని, అవి పెరిగేటట్లు పర్యవేక్షణ కూడా చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సాయిసుధీర్ తదితరులు పాల్గొన్నారు.
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ నాగప్రసాద్, సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ మహేశ్వరప్రసాద్, డీపీఎంయూ డాక్టర్ ఉమా, ఎస్ఓ హేమసుందరం పాల్గొన్నారు.

స్వచ్ఛతాహీ సేవాలో భాగస్వామ్యం పెరగాలి

కర్నూలు కల్చరల్: పరిసరాల పరిశుభ్రతకు పెద్దపీట వేస్తూ నిర్వహిస్తున్న స్వచ్ఛ తాహీ సేవా కార్యక్రమంలో యువత భాగస్వామ్యం పెరగాలని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వి.వెంకట బసరావు అన్నారు. శనివారం వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వర్సిటీలో స్వచ్ఛత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ కుమార్ నాయుడు, ప్రిన్సిపాల్ ఆచార్య సీవీ కృష్ణారెడ్డి మాట్లాడారు.

జెడ్పీలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ కార్యాలయం, పరిసరాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి అన్నా రు. పీఆర్ కమిషనర్ ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం జెడ్పీలోని ఉద్యోగులు, సిబ్బంది అందరు జెడ్పీలోని పరిసరాలను శుభ్రంగా ఉంచే కార్యక్రమం చేపట్టారు.

కల్లూరు: మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కల్లూరు అర్బన్ 26వ వార్డు కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. శనివారం వివిధ కాలనీల్లో మొక్కలు నాటి నీళ్లు పోశారు.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా..

కర్నూలు(అగ్రికల్చర్): పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా మొక్కలు నాటి పెంచాల్సిన అవసరం ఎంతో ఉందని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. శనివారం వ్యవసాయ శాఖ కర్నూలు ఏడీఏ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏడీఏ శ్రీవర్ధన్‌రెడ్డి, డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏఓలు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

కర్నూలు సిటీ: నగర శివారులోని జగన్నాథగట్టులో ఉన్న ట్రిపుల్‌ఐటీడీఎం విద్యార్థులు శనివారం ఓర్వకలు గ్రామంలో పరిసరాల పరిశుభ్రత, ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. తర్వాత ఓర్వకల్లు రాక్‌గార్డెన్‌లో పారవేసిన ప్లాస్టిక్ వస్తువులను సేకరించారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీడీఎంకి చెందిన అసోసియేట్ డీన్ నరేష్ బాబు, ఉన్నత్ భారత్ అభియాన్ కో-ఆర్డినేటర్ నాగరాజు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ మణి శంకర్ పాండే పాల్గొన్నారు.

గ్రీన్ సిటీగా నగరాన్ని తీర్చిదిద్దాలి



పెద్దపాడులో మొక్కలు నాటుతున్న కమిషనర్, డిప్యూటీ మేయర్

కర్నూలు (టౌన్): నగరాన్ని గ్రీన్ సిటీగా తీర్చిదిద్దుతున్నట్లు నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ్ అన్నారు. ఒకేరోజు నగరంలో 6 వేల మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక పెద్దపాడులో నగరపాలక డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుకాతో కలిసి కమిషనర్ మొక్కలు నాటారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పచ్చదనం పెంచడంలో ప్రజల సహకారం అవసరమన్నారు. గత మూడు మాసాలుగా 12 వేల మొక్కలు నాటినట్లు చెప్పారు. ఈ ఏడాది 30 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, హార్టికల్చర్ ఏడీ విజయలక్ష్మి, ప్రజారోగ్య ఆధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఎంఈ మనోహర్ రెడ్డి, డీఈఈ గిరిరాజు పాల్గొన్నారు.

కమీషన్ ఏజెంట్ల కాసుల కక్కుర్తి

- గుట్టుచప్పుడు కాకుండా ఉల్లిగడ్డల రీసైక్లింగ్

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని కొందరు కమీషన్ ఏజెంట్లకు కాసుల కక్కుర్తి పట్టుకుంది. రైతులు తెచ్చిన ఉల్లిగడ్డలను కమీషన్ ఏజెంట్లే కారుచౌకగా కొని వాటిని బయటికి తరలించి అవే ఉల్లిగడ్డలకు తిరిగి మార్కెట్‌లో అమ్మకానికి పెడుతున్నట్లు తెలుస్తోంది. గుట్టు చప్పడు కాకుండా ఉల్లి రీసైక్లింగ్ జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. కర్నూలు మండలం సుంకేసుల గ్రామానికి చెందిన పలువురు మార్కెట్‌యార్డులో కమీషన్ ఏజెంట్లుగా ఉన్నారు. వీరిలో ఒకరిద్దరు ఉల్లిగడ్డల రీసైక్లింగ్‌కు పాల్పడినట్లు మార్కెట్ కమిటీ అధికారులు భావిస్తున్నారు. శుక్రవారం రాత్రి మార్కెట్‌లోకి వచ్చిన ఉల్లిగడ్డల వాహనాలను తనిఖీ చేశారు. వారి దగ్గర ఈ-క్రాప్ ధ్రువపత్రం, ఇతర డాక్యుమెంట్లు ఏవీ లేకపోవడం గుర్తించిన అధికారులు ఆ వాహనాలను పక్కన పెట్టారు. ఈ ఉల్లి గడ్డలు కమీషన్ ఏజెంట్లకు చెందినవిగా భావిస్తున్నారు. వెనుక అన్ని ధ్రువపత్రాలు తెస్తున్నారని చెప్పినప్పటికి తీసుకురాలేదు. నకిలీలతో రీసైక్లింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. రీసైక్లింగ్‌ను నివారించేందుకు ప్రత్యేక టీమ్‌లు వేసినప్పటికీ జరుగుతుండటం పలు అనుమానాలకు తావు ఇస్తోంది.

పలువురు వ్యాపారులకు జరిమానా



తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రాజగోపాల్

కర్నూలు(హాస్పిటల్): నాణ్యతా ప్రమాణాలు లోపించిన ఆహారాన్ని విక్రయిస్తున్న పలువురు వ్యాపారులకు జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ నవ్య ఆదేశాల మేరకు జరిమానా విధించినట్లు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రాజగోపాల్ చెప్పారు. ఎమ్మిగనూరులోని శ్రీ దుర్గా ఫ్యాన్సీ జనరల్ స్టోర్స్‌కు రూ.10 వేలు, ఆదోనిలోని జై జవాన్, జై కిసాన్ మెగా మార్ట్‌కు రూ.20 వేలు, కర్నూలులోని బాల్‌పర్ హోమ్ నీడ్స్‌కు రూ.5 వేలు, కల్లూరులోని అంబికా ట్రేడర్స్‌కు రూ.30 వేలు, కర్నూలులోని సంజయ్ గాంధీ నగర్‌లో ఉన్న ఎస్ఎస్‌వీ హోమ్ మేడ్ ఫుడ్స్‌కు రూ. 20 వేలు, వెల్‌కమ్ మార్ట్ డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌కు రూ.20 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. శుక్రవారం రాత్రి సైతం కర్నూలు నగరంలోని సి.క్యాంపు నుంచి నంద్యాల చెక్‌పోస్టు వరకు పలు ఆహార పదార్థాల విక్రయ దుకాణాలపై దాడులు నిర్వహించామన్నారు. గోబీ మంచూరి, ఐస్‌క్రీమ్, ఫ్రూట్ జ్యూస్‌లలో నిషేధిత రంగులు కలిపిన, కాలం చెల్లిన వాటిని విక్రయిస్తున్న వారిని హెచ్చరించామన్నారు.

అవయవదానంపై విస్తృత ప్రచారం


- రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి



సమావేశంలో డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా తాలూకా, మండల స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేసి రక్తదానం, నేత్రదానం, అవయవదానంపై విస్తృత ప్రచారం చేయాలని ఆ సంస్థ జిల్లా చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి చెప్పారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కర్నూలు జిల్లా నూతన కమిటీ సమావేశం శనివారం బ్లడ్ బ్యాంకులో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కేజీ గోవిందరెడ్డి మాట్లాడుతూ అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను రెడ్‌క్రాస్‌సొసైటీ ద్వారా చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం యువతను, ప్రభుత్వ అధికారులను, స్వచ్ఛంద సంస్థలను, పోలీసు అధికారులను అనుసంధానం చేయనున్నామన్నారు. మాదక ద్రవ్యాలు సేవించే వారికి ప్రభుత్వం విధించే శిక్షలు ఏ విధంగా ఉంటాయో వివరించేందుకు పోలీస్ శాఖ ద్వారా విస్తృత ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌డోనర్ క్లబ్ ఏర్పాటు చేయాలని తీర్మానించామని, వీధి, గ్రామ, మండల, పట్టణంలో యువతకు రక్తదాన గ్రూపులు ఏర్పాటు చేసి వారికి బ్లడ్‌గ్రూపు కార్డు ఇస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కె.అరుణ, ట్రెజరర్ ఐ. నరసింహ, మాజీ చైర్మన్ జి. శ్రీనివాసులు యాదవ్, కమిటీ సభ్యులు కేవీ సుబ్బారెడ్డి, బి. ప్రభాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, భీమ శంకర్‌రెడ్డి, సెక్రటరి వెంకటకృష్ణుడు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కుమారస్వామిరెడ్డి, డాక్టర్ రామచంద్రరావు పాల్గొన్నారు.

విద్యార్థులపై కేసులు అన్యాయం



సుందరయ్య సర్కిల్‌లో ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నగర కమిటీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఆదోని మెడికల్ కాలేజీని ప్రైవేట్ పరం చేయరాదని ఎస్ఎఫ్ఐ విద్యార్థులు ఆందోళన చేస్తే వారిని పోలీసులతో కొట్టించి అక్రమంగా కేసులు పెట్టడం అన్యాయమని ఆ సంఘం నగర కమిటీ ఖండించింది. శనివారం సుందరయ్య సర్కిల్‌లో సంఘం ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. వెంటనే కేసులను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నగర ఉపాధ్యక్షుడు ఆర్యన్ మాట్లాడుతూ..ప్రభుత్వ కాలేజీని ప్రైవేట్‌కు ఇవ్వరాదని ఆందోళన చేపట్టిన ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు సాయి మొదలగు వారిపై పోలీసులు కేసులు పెట్టారన్నారు. అంతేకాక ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులపై పోలీసులు కర్కశంగా లాఠీ చార్జీ చేసి బూటు కాళ్లతో తన్నుతూ పిడిగుద్దులు గుద్దడం విచారకరమన్నారు. ప్రైవేట్ కాలేజీల్లో పేద , మధ్య తరగతి విద్యార్థులకు కేవలం 50 శాతం సీట్లు ఉంటాయని, మిగిలిన సీట్లను ఆయా యాజమాన్యాలు అమ్ముకుంటాయన్నారు. అప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. వెంటనే విద్యార్థి సంఘాల నాయకులపై పెట్టిన కేసులను ఎత్తి వేయకపోతే పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పృధ్వీ, హర్ష, చరణ్, సాయి పాల్గొన్నారు.

మహిళలు క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి



కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): దేశంలో క్యాన్సర్ అధికమవుతోందని, ప్రతి మహిళా ఈ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ చెప్పారు. స్వస్థ్ నారీ-సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ ప్రజల జీవనశైలి మారిందని, తీసుకునే ఆహారం పదార్థాలు హానికర కారకాలతో కూడి ఉంటున్నాయని, అందువల్ల వివిధ రకాల క్యాన్సర్‌లు వస్తున్నాయని తెలిపారు. ఆరోగ్యం విషయంలో చిన్నపాటి తేడాలు కనిపించినా వెంటనే వైద్యుల సలహాలు తీసుకోవాలని సూచించారు. అనంతరం హాస్పిటల్ వైద్యులకు, నర్సింగ్ సిబ్బందికి, పారామెడికల్ సిబ్బందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ మాధవి శ్యామల, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి దసరా ఉత్సవాలు

కర్నూలు కల్చరల్: పవిత్ర తుంగభద్ర నది తీరంలోని దక్షిణ షిరిడీ సాయిబాబా దేవాలయంలో ఈనెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలక మండలి సభ్యులు మహాబలేష్ పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం స్వామివారికి మహాభిషేకం, మధ్నాహ్నం ప్రసాద వితరణ, సాయంత్రం ఆకుపూజ, పల్లకీ సేవ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులందరూ పాల్గొనవచ్చని విజ్ఞప్తి చేశారు.

13 గంటల పని విధానాన్ని రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఏపీ అసెంబ్లీలో ఆమోదించిన 13 గంటల పని విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ న్యూసిటీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వై.నగేష్, ఆర్.నరసింహులు శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్మికులను ఇబ్బందులకు గురి చేసే బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలపడం అన్యాయమన్నారు. దీనిని బట్టి ఎమ్మెల్యేలకు కనీస పరిజ్ఞానం లేదని, 13 గంటల పని విధానంలో మహిళలు రాత్రిళ్లు కూడా పనిచేయాల్సి వస్తుందన్న విషయాన్ని కూడా ఎవరూ గ్రహించకపోవడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు.

ఈ రోజు

కామ్రేడ్ జేఎస్ శేషయ్య సంస్మరణ సభ

కర్నూలు కల్చరల్: సీపీఎం నాయకులు, సుందరయ్య విజ్ఞాన స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ కామ్రేడ్ జేఎస్ శేషయ్య సంస్మరణ సభను ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక కేకే భవన్‌లో నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు బీడీ సుధీర్ రాజు తెలిపారు. జేవీవీ కార్యకర్తలు, సీపీఎం కార్యకర్తలు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

జన విజ్ఞాన వేదిక సమావేశం

కర్నూలు కల్చరల్: జన విజ్ఞాన వేదిక ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం సాయంత్రం 5 గంటలకు స్థానిక కేకే భవన్‌లో నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు బీడీ సుధీర్ రాజు తెలిపారు. ఇటీవల జరిగిన జేవీవీ రాష్ట్ర మహాసభల్లో జరిగిన విషయాలపై సమీక్ష ఉంటుందని పేర్కొన్నారు. జేవీవీ కార్యకర్తలు అందరూ హాజరు కావాలని సూచించారు.

వెంకట కృష్ణ కవిత్వ సమగ్ర సంపుటి ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్: ప్రముఖ కవి వెంకట కృష్ణ కవిత్వ సమగ్ర సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఉదయం 10 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు కర్నూలు కవులు తెలిపారు. సాహితీ వేత్త జి.భార్గవ ఈ సంపుటిని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. లో గొంతుకను ఎస్. నాగమణి, దున్నేకొద్ది దుఃఖంను మారుతీ పౌరోహితం, కొన్ని రంగులు ఒక పద్యంను జంధ్యాల రఘుబాబు, చినుకుదీవిని డాక్టర్ అరుణ, కంచె దాటే పాటను కొత్తపల్లి సురేష్ (అనంతపురం) సమీక్షిస్తారని తెలిపారు. సాహితీ వేత్తలు, సాహితీ ప్రియులు పాల్గొనాలని కోరారు.

అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు

కర్నూలు (టౌన్) : విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే శాఖ పర చర్యలు తప్పవని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ హెచ్చరించారు. శనివారం సాయంత్రం స్థానిక నగరంలోని రోజా వీధి, ప్రకాష్ నగర్ సంకల్‌బాగ్‌లోని 123, 124 సచివాలయాలను కమిషనర్ తనిఖీ చేశారు. మూవ్‌మెంట్ రిజిస్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సచివాలయాలకు వచ్చే ప్రజలను పదే పదే తిప్పుకొకుండా పనులను పూర్తి చేయాలన్నారు. ప్రతి రోజు ఏదో ఒక సచివాలయాన్ని తనిఖీ చేస్తానన్నారు.

మధుశేఖర్‌కు డాక్టరేట్ ప్రదానం



మధుశేఖర్

కర్నూలు కల్చరల్: నగర శివారులోని జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న కర్నూలు మండలం పసుపుల గ్రామానికి చెందిన మధుశేఖర్‌కు కడప యోగివేమన విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ విషయాన్ని ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైవీయూ చరిత్ర, పురాతత్వ శాఖ ఆచార్యులు జి.సాంబశివ రెడ్డి పర్యవేక్షణలో 'గ్రోత్ ఆఫ్ ప్రెస్ అండ్ నేషనలిజం ఇన్ కలోనియల్ కర్నూలు డిస్ట్రిక్ట్ డ్యూరింగ్ ఏడీ 1858– 1947: ఏ స్టడీ ' అనే అంశంపై చేసిన పరిశోధన సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. వైవీయూ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు మార్గదర్శకత్వంలో నియమితులైన నిపుణుల బృందం మధుశేఖర్ సిద్ధాంత గ్రంథాన్ని అధ్యయనం చేసి పీహెచ్‌డీ అవార్డుకు అర్హత ఉన్నట్లు ధ్రువీకరించారు. దీంతో వర్సిటీ పీహెచ్‌డీ అవార్డును ప్రదానం చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈయన ఇప్పటికే యూజీసీ నెట్, ఏపీసెట్, టీఎస్‌సెట్, ఏపీఆర్‌సెట్‌లలో ప్రతిభ కనబరిచి క్వాలిఫై అయ్యారు. డాక్టరేట్ పొందిన మధుశేఖర్‌కు వైవీయూ చరిత్ర, పురాతత్వ శాఖ ప్రొఫెసర్లు, పుల్లయ్య కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

కారు చీకట్లో కాంతి కిరణం ' నారాయణ గురు '



నారాయణ గురు చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న మహిళా నేతలు

కర్నూలు(అర్బన్): బహుజనులకు విద్య అందుబాటులో లేని సమయంలో విద్య కోసం అనేక రూపాల్లో ఆందోళనలు, ఉద్యమాలు నిర్వహించిన మహోన్నత వ్యక్తి కారు చీకట్లో కాంతి కిరణం నారాయణ గురు అని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయ లక్ష్మి అన్నారు. శనివారం నగరంలోని వేదిక కార్యాలయంలో సామాజిక సంఘ సంస్కర్త నారాయణ గురు 97వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా నారాయణ గురు చిత్రపటానికి మహిళా నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక సమానత్వం కోసం, అంటరానితనానికి వ్యతిరేకంగా నారాయణ గురు పోరాటాలు నిర్వహించారన్నారు. దేవాలయాలనే పాఠశాలలుగా మార్చి చదువు నేర్పించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. నారాయణ గురు ఆలోచనా విధానాన్ని కొనసాగిస్తూ వేదిక పని చేస్తున్నదని చెప్పారు.

కీర్తి స్కూల్ గుర్తింపు రద్దు

- విద్యార్థి తల్లి ఫిర్యాదు మేరకు స్కూల్‌పై కేసు నమోదు
- ప్రకటనకే పరిమితమైన పాఠశాలల తనిఖీలు



కర్నూలు సిటీ: నగరంలోని కీర్తి హైస్కూల్ గుర్తింపును రద్దు చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శామ్యూల్ పాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 15న ఈ స్కూల్ గోడ కూలి షేక్ రాఖీబ్ అనే విద్యార్థి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై స్కూల్ కరస్పాండెంట్‌కు నోటీసు జారీ చేయగా అందుకు ఆయన ఇచ్చిన సమాధానం సహేతుకంగా లేకపోవడం, ఇదే సమయంలో మృతుడి తల్లి వజుదా బాను ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వీటిని పరిగణలోకి తీసుకున్న జిలా కలెక్టర్ డా.సిరి స్కూల్‌యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో విద్యాశాఖ అధికారులు ఖవ్వాడి వీధిలోని కీర్తి ఇంగ్లిష మీడియం ప్రైమరీ స్కూల్ గుర్తింపును రద్దు చేస్తున్నట్లు శనివారం ప్రకటించారు. అలాగే ఈ స్కూల్‌లో చదువుతున్న పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నా ఏర్పాట్లు చేశారు.

తనిఖీలు ఏవీ?

స్కూల్ గోడ కూలి విద్యార్థి మృతి చెందిన నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రైవేటు స్కూళ్లను తనిఖీలు చేయిస్తామని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్కూళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఈఓ ప్రకటన చేశారు. కానీ ఇంత వరకు తనిఖీలకు ఎలాంటి కమిటీలు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. జిల్లాలో 767 స్కూళ్లు ఉన్నాయి. వీటిలో చాలా వాటిలో విద్యార్థులకు కనీస సదుపాయాలు కూడా లేవు. చిన్నపాటి తరగతి గదులు, వెలుతురు లేని, గాలి రాని గదులు ఉంటున్నాయి. విద్యాశాఖ అధికారులు అనుమతులు, రెన్యూవల్స్ చేసే సమయంలో స్కూళ్లను సందర్శించాలి. అయితే, అలా చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

బ్రాహ్మణుల ఆర్థికాభివృద్ధికి చేయూత అందించాలి



డైరెక్టర్‌ను సన్మానిస్తున్న బ్రాహ్మణ సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన బ్రాహ్మణులకు ఆర్థికంగా చేయూత అందించేందుకు ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ వివిధ పథకాలను అమలు చేయాలని నగర బ్రాహ్మణ సంఘం 411/2015 అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్ కోరారు. శనివారం స్థానిక సంకల్‌బాగ్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి, భవానీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ కలపటపు బుచ్చి రాంప్రసాద్ పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా ఎన్నికైన ధార్వాడ ఆనందరావు, ఎస్‌కే శ్రీనివాసరావును ప్రముఖ న్యూరో సర్జన్ డబ్ల్యూ సీతారామ్, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ కల్కూరా, అఖిల భారతీయ నిత్యాన్నదాన ప్రధాన కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్, విశ్రాంత పోస్టల్ సూపరింటెండెంట్ కేవీ సుబ్బారావు తదితరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు చెరువు దుర్గా ప్రసాద్, ప్రధాన కార్యదర్శి చల్ల నాగరాజశర్మ, ఉపాధ్యక్షులు కంచుగంటల శ్యాంసుందరరావు, శ్రీమతి కృష్ణజ్యోతి, బీఎస్ రామరాజు, టీవీ రవిచంద్రశర్మ, రాజేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అనధికారిక నిర్మాణాలను గుర్తించండి

కర్నూలు (టౌన్) :నగరంలోని సచివాలయాల వారీగా అనధికారిక నిర్మాణాలను గుర్తించి వాటిపై తీసుకున్న చర్యలపై నివేదికలు సమర్పించాలని నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ్ ఆదేశించారు. శనివారం సాయంత్రం స్థానిక నగరపాలకలోని తన చాంబర్‌లో కమిషనర్ టౌన్ ప్లానింగ్, సచివాలయ స్థాయి బృందాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, సూపరింటెండెంట్ సుబ్బన్న, డీసీపీ వెంకటరమణ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి అంజాద్ బాషా పాల్గొన్నారు.

హౌస్‌కీపింగ్ సిబ్బంది సేవలు అమూల్యం

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రుల పరిశుభ్రత విషయంలో హౌస్ కీపింగ్ చేస్తున్న సేవలు అమూల్యమైనవని కర్నూలు నగర పాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి చెప్పారు. అంతర్జాతీయ హౌస్ కీపింగ్ వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో హౌస్ కీపింగ్ సిబ్బందికి సన్మానం చేసి జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి క్లస్టర్ హెడ్ మహేశ్వరరెడ్డి, న్యూరోసర్జన్ డాక్టర్ విశ్వకుమార్, ఆపరేషన్ మేనేజర్ హెడ్ ఇమ్రాన్, రీజనల్ మేనేజర్ హెడ్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.